గోదావరి జిల్లా

కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

గృహ లబ్ధిదారులకు రూ.5 లక్షలు మంజూరు చేయాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి బోడకొండ డిమాండ్

విశాలాంధ్ర - కాకినాడ : ఇల్లు లేని నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వమే స్థలం మంజూరు చేయడంతో పాటు పక్కా గృహాలు కట్టిస్తామని హామీ ఇచ్చి, వారిని నిలువునా మోసం చేస్తున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి బోడకొండ ఆవేదన వ్యక్తం చేశారు. కాకినాడలో శుక్రవారం వైయస్ జగన్మోహన పురంలో సీపీఐ బృందం పర్యటన చేసింది. ఈ సందర్భంగా బోడకొండ మాట్లాడుతూ స్థలంతో పాటు పక్కా గృహాలు కట్టిచ్చేస్తాం అన్న మాట మార్చారని, మాట తప్పను మడమ తిప్పనన్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పేదోళ్లకు ఇళ్ల నిర్మించడంలో మాట తప్పారని అన్నారు. ప్రభుత్వం లోన్లు మంజూరు చేస్తూ అందులో సిమెంటు 40 బస్తాలు, లారీ ఇసుక, ఐరన్ 12 ఎంఎం 14, 18 ఎంఎం 35 మంజూరు చేసి లోన్‌లో తగ్గిస్తున్నారని, ఒక లబ్ధిదారుడు ఇల్లు పూర్తి అయ్యేసరికి సుమారుగా 9 లక్షల రూపాయలు ఖర్చవుతుందని, కనీసం ప్రభుత్వం 5 లక్షలన్నా ప్రభుత్వం మంజూరు చేయాలని లబ్ధిదారులు తెలియ జేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. నిర్మాణ సామాగ్రి ధరలు ఆకాశాన్నంటాయని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ప్రభుత్వం తక్షణమే ఐదు లక్షల మంజూరు చేయాలని బోడకొండ డిమాండ్ చేశారు. జిల్లా సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్, గంప లోవరత్నంలు మాట్లాడుతూ స్థలం మంజూరు చేసిన దానిలో ఇల్లు నిర్మించకపోతే స్థలం తీసుకుంటామని అధికారులు బెదిరిస్తున్నారని, అలా బెదిరిస్తే సహించేది లేదన్నారు. సాగరమాల రోడ్ల పేరుతో లబ్ధిదారులకు ఇచ్చిన పట్టాలు ఇంకా దాదాపు 3 వేల వరకు పెండింగ్లో ఉన్నాయని తక్షణమే వాటన్నింటినీ మంజూరు చేయాలని వారన్నారు. ఈ పర్యటనలో సీపీఐ నగర కార్యదర్శి టి. అన్నవరం, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు జి. వెంకన్న బాబు, లోతు బాబు పాల్గొన్నారు.

సచివాలయాలకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయండి

విశాలాంధ్ర - ఆలమూరు : ఆలమూరు మండలంలో గల అన్ని సచివాలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలంటూ మండల పరిధి గుమ్మిలేరు గ్రామ సర్పంచ్ గుణ్ణం రాంబాబు స్థానిక ఎంపీడీవో కే జాన్ లింకన్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా గుణ్ణం మాట్లాడుతూ సీసీ కెమెరాల ఏర్పాటు చేయడం వలన సచివాలయ సిబ్బందిలో జవాబుదారితనం ఉంటుందని, సచివాలయాలకు వచ్చే ప్రజలకు సిబ్బంది అందించే సేవలు ప్రత్యక్షంగా చూడగలుగుతామని అన్నారు. వచ్చే మండల సమావేశంలో సీసీ కెమెరాలు ఏర్పాటుపై చర్చించి తగు చర్యలు చేపడతామని ఎంపీడీవో సర్పంచ్‌కు హామీ ఇచ్చారు.

వలంటీర్ శ్రీదేవి సేవా దృక్పథం

కాకినాడ వెళ్లి పింఛను అందజేత

విశాలాంధ్ర - మండపేట : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలలో భాగమైన పింఛన్ పథకంతో రాష్ట్రంలోని లక్షలాది పేద, బడుగు బలహీన వర్గాల ప్రజలకు అండగా నిలుస్తుంటే ఆ పథకాన్ని క్షేత్ర స్థాయిలో నూటికి నూరు శాతం ప్రజలకు చేరవేయడంలో వలంటీర్లు పోషిస్తున్న పాత్ర వర్ణనాతీతం. పింఛన్ సొమ్ము మీదే ఆధారపడి జీవిస్తున్న ప్రజలకు ఒకటో తారీఖు వచ్చిందంటే పండగే. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలతో పాటు దివ్యాంగులు కూడా నెలకోసారి వచ్చే ఒకటో తేదీ కోసం గంపెడాశతో ఎదురుచూస్తారు. ఈ క్రమంలో ఆకాశపు రాజు అనే వ్యక్తి అనారోగ్యంతో కాకినాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం కౌన్సిలర్ నీలం దుర్గమ్మ దృష్టికి రావడంతో సంబంధిత వలంటీర్ రొంగల శ్రీదేవిని ఎలాగైనా పింఛన్ దారుడికి సొమ్ము అందించాలని కోరారు. దీంతో వెంటనే వలంటీర్ శ్రీదేవి తన సొంత ఖర్చులతో కాకినాడ వెళ్లి పింఛన్ సొమ్ములు అందజేశారు. మహిళా వలంటీర్ శ్రీదేవి సేవా దృక్పథాన్ని మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ దుర్గారాణి, కమిషనర్ రామ్ కుమార్, ఎమ్మెల్సీ టి. జగపతి, మున్సిపల్ కౌన్సిలర్లు అభినందించారు.

కెఆర్ పాఠశాలలో విజిలెన్స్ తనిఖీ

విశాలాంధ్ర - అనపర్తి : స్థానిక పాత ఊరిలోని కర్రి అప్పారావు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ డిపార్ట్మెంట్ శుక్రవారం తనిఖీ నిర్వహించింది. భోజన విధానం పరిశీలించి ఎంతమంది పిల్లలు భోజనం తింటున్నారు, ఎంతమంది తినడం లేదు, ఎందుకు తినడం లేదు, భోజనం మెనూ ప్రకారం వస్తుందా లేదా అనే విషయాలు కూలంకషంగా డిపార్ట్మెంట్ విద్యార్థులను అడిగి తెలుసుకుంది. విద్యార్థులకు సకాలంలో సక్రమంగా నాణ్యమైన ఆహారం అందించడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్న ప్రధానోపాధ్యాయులు పులగం వెంకటరెడ్డిని డిపార్ట్మెంట్ అభినందించింది. ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ వై. సత్య కిషోర్, అసిస్టెంట్ జియాలజిస్ట్ లక్ష్మీనారాయణ, వెల్ఫేర్ అసిస్టెంట్ కీర్తి, వి. ఈశ్వరరావు, ఉపాధ్యాయులు వై. రాంబాబు, ఎం. సురేష్, డి. శేషయ్య ఉన్నారు.

కంప్యూటర్ పరిజ్ఞానం పెంపొందించుకోవాలి

విశాలాంధ్ర-దేవరపల్లి: కంప్యూటర్ సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించుకోవాలని బి హెచ్ ఎస్ ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ బిడిఎస్ కుమార్ విద్యార్థులకు సూచించారు. శుక్రవారం స్థానిక బి హెచ్ ఎస్ ఆర్ అండ్ వి ఎల్ ఎం డిగ్రీ పీజీ కళాశాలలో కంప్యూటర్ లిటరసీ దినోత్సవాన్ని ప్రిన్సిపాల్ బిడిఎస్ కుమార్ అధ్యక్షతన కంప్యూటర్ అధ్యాపకులు సి హెచ్. వెంకట్, బి.కిరణ్ కుమార్‌ల ఆధ్వర్యంలో విద్యార్థులు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భముగా ప్రిన్సిపాల్ కుమార్ మాట్లాడుతూ కంప్యూటర్ ప్రాధాన్యతను వివరించి సాంకేతిక పరిజ్ఞానం పెంచుకో వాలని విద్యార్థులకు సూచించారు. కళాశాల ఏవో డి. ఆనంద్ ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు కళాశాలలో ఉన్న అత్యాధునిక కంప్యూటర్ ల్యాబ్‌ను ఉప యోగించుకుని కంప్యూటర్ పరిజ్ఞానమును పెంపొందించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని నిర్వహించిన కళాశాల సిబ్బందిని విద్యార్థులను కరస్పాండెంట్ డి . సువర్ణ రాజు అభినందించారు.

ఆదిత్యలో జెఎన్‌టియుకె అంతర్ కళాశాలల అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ పోటీలు ప్రారంభం

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య ఇంజనీరింగ్ ప్రాంగణంలో కాకినాడ జెఎన్‌టియుకె పరిధిలోని అంతర్ కళాశాల అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ 2022-2023" పోటీలు (పురుషుల, మహిళల) ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆదిత్య క్యాంపస్ డైరెక్టర్ & ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా జెఎన్‌టియుకె నరసాపురం ఫిజికల్ డైరెక్టర్, ఇంటర్ కాలేజియేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ జిపి రాజు విచ్చేసారు. ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ. రమేష్, తూర్పుగోదావరి అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్షులు ఆర్ఎంసి ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ స్పర్జన్ రాజ్, తూర్పుగోదావరి అథ్లెటిక్ అసోసియేషన్ సెక్రటరీ టివిఎస్ రంగారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ రెండురోజుల పాటు జరగనున్న వివిధ రకాల పోటీలు క్రీడాకారుల అందరూ మంచి క్రీడా స్ఫూర్తి ప్రదర్శించి మంచి ప్రదర్శనతో విజేతగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థి విభాగం డీన్ జెడి వెంకటేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ సిహెచ్ మురళీమోహన్, వివిధ కళాశాల నుండి వచ్చిన ఫిజికల్ డైరెక్టర్‌లు క్రీడాకారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు బోధనకే పరిమితం

విశాలాంధ్ర - తాళ్ళపూడి : ఉపాధ్యాయులను బోధనేతర పనులనుండి తప్పించి కేవలం బోధనకే పరిమితం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు ఇవ్వడం సంతోషించదగ్గ పరిణామం అని ఏపీటీఎఫ్ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు డిడి రావు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఇటీవల ఎన్నిక విధులు, జనాభా లెక్కల సేకరణ పనులనుండి తప్పిస్తున్నట్లు వైకాపా ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. కేవలం 5 సంవత్సరాలకు ఒకసారి జరిగే ఎన్నికల విధులు, 10 సంవత్సరాలకు ఒకసారి జరిగే జనగణన విధుల నుండి మాత్రమే తప్పించే విధంగా ఉత్తర్వులు ఇవ్వడం సరికాదని అన్నారు. బోధనకు ప్రధాన అడ్డంకిగా ఉన్న అనేక రకాల యాప్‌ల నిర్వహణ, నాడు నేడు పనుల పర్యవేక్షణ, టాయిలెట్ ఫోటోలను అప్లోడ్ చేయడం, మధ్యాహ్న భోజనానికి సంబంధించి ప్రతిరోజు ఏడు ఫోటోలను అప్లోడ్ చేయడం, జేవీక్ కిట్లను, టాయిలెట్ మెటీరియల్స్ ఒకేసారి కాకుండా విడతల వారీగా ఇవ్వడం, వాటిని ఉపాధ్యాయులే ఎం ఆర్ సి లనుండి లేదా వివిధ స్టాక్ పాయింట్ల నుండి స్కూళ్లకు చేర్చడం వంటి అనేక బోధనేతర పనులనుండి తప్పించినప్పుడు మాత్రమే ఉపాధ్యాయులకు మంచి జరిగినట్లవుతుందని అన్నారు.

చంద్రబాబు రోడ్‌షోకు మహిళల నీరాజనం

విశాలాంధ్ర-చాగల్లు : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం ఇదేమి కర్మ రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా రోడ్ షో నిర్వహించారు. చాగల్లు మండలం గౌరుపల్లి మీదుగా దారవరం వరకు సాగిన ర్యాలీలో మహిళలు భారీ ఎత్తున హారతులు పట్టారు. కార్యకర్తలు కారులోనూ ద్విచక్ర వాహనాలు ద్వారా ర్యాలీ నిర్వహించారు. చంద్రవరం గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహానికి ఆ గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. దారవరం గ్రామంలో డాబాలపై నుండి మహిళలు పూల వర్షం కురిపించారు. ఈ కార్యక్రమంలో మాజీ తూర్పుగోదావరి జిల్లా టిడిపి అధ్యక్షులు కేఎస్ జవహర్, గోరంట్ల బుచ్చియ్య చౌదరి, ఏలూరు జిల్లా టిడిపి అధ్యక్షురాలు తోట సీతామాలక్ష్మి, పాలకొల్లు శాసనసభ్యులు నిమ్మల రామానాయుడు, ఉండి శాసనసభ్యులు మంత్రి రామరాజు, మాజీ శాసనసభ్యులు గన్ని వీరాంజనేయులు, ఘంటా మురళి, నల్లమిల్లి రామకృష్ణ రెడ్డి, ఎమ్మెల్సీ షేక్ షరీఫ్, త్రిశూర కమిటీ సభ్యులు జొన్నలగూడ చౌదరి, కంటమనేనిరామకృష్ణ ,ఆళ్ల హరిబాబు, నాదల శ్రీరామ్ చౌదరి, కేతా సాహెబ్ ,కోడూరు కాశి తదితరులు భారీ ఎత్తున పాల్గొన్నారు.

లింగ వివక్షతపై పేరూరులో ర్యాలీ

విశాలాంధ్ర - అమలాపురం : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మండలం పేరూరు గ్రామంలో సర్పంచ్ దాసరి అరుణ అధ్యక్షతన లింగ వివక్షత పై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో గ్రామస్తులకు, మహిళలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అమలాపురం మండల అధ్యక్షులు కుడుపూడి భాగ్యలక్ష్మి బాబు, ఎంపీటీసీ సభ్యులు చొల్లంగి సుబ్బురామ్, వాసంశెట్టి శ్రీను, డిఆర్‌డిఏ ఏపిడీ రమణ, సిసి లక్ష్మి, ఎఎన్ఎంలు ఆశవర్కర్స్, అంగన్వాడీ ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శి ఆర్ఎస్ఎస్ సూరపరాజు, సచివాలయ సిబ్బంది, డ్వాక్రా మహిళలు, డ్వాక్రా యానిమేటర్స్, వలంటీర్లు పాల్గొన్నారు.

పేదవాడి సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర - అమలాపురం : పేదవాడి సొంతింటి కల నెరవేర్చడమే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర టిడ్కో చైర్మన్ జె. ప్రసన్న కుమార్ అన్నారు. అమలా పురం మున్సిపాలిటీ పరిధి లోని పేదలకు బోడసకుర్రులో నిర్మించిన టిడ్కో గృహాలను శుక్రవారం టిడ్కో చైర్మన్ పరిశీలించారు. ముందుగా టిడ్కో భవనాల సముదాయం వద్ద ప్రకృతిని పెంపొందించేందుకు మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ప్రసన్నకుమార్ మాట్లాడుతూ నవరత్నాల పథకాలలో భాగంగా పేదవాడికి సొంత గూడును కల్పించేందుకు గత ఆరు నెలల నుండి గృహాలను లబ్ధిదారులకు అందిస్తున్నామన్నారు. టిడ్కో గృహాల సముదాయం వద్ద నెలకొన్ని వున్న సమస్యలను రాష్ట్ర మంత్రులు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, పినిపే విశ్వరూప్‌ల దృష్టికి టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్ తీసుకెళ్ళి వారి సూచనలు మేరకు టిడ్కో గృహాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఆఫీసర్ ఈఈ టి. రీటా, మున్సిపల్ కమిషనర్ వి అయ్యప్ప నాయుడు, టిడ్కో డిఇ వరదరాజులు, ఏఇ కిషోర్, సిటీ లెవెల్ టెక్నికల్ కోఆర్డినేటర్ డి. లలిత, సిఎంఎం హుస్సేన్, కమ్యూనిటీ ఆర్గనైజర్ రాజేశ్వరీ, ఆర్పీలు, మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో సీపీఎం నాయకులు రామారావు మృతి

విశాలాంధ్ర - రాజోలు : మండలంలోని సొంపల్లి గ్రామానికి చెందిన సిపిఎం మండల నాయకులు, సిఐటియు సీనియర్ నాయకులు కందిగట్ల రామారావు (65) సఖినేటిపల్లి మండలం మోరిలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో హఠాన్మరణం చెందారు. ఈనెల 7 తన కుమారుడు వివాహం జరుగనున్న నేపధ్యంలో శుక్రవారం రామారావు అతని భార్య గిరిజలు దిచక్ర వాహనం పై అంతర్వేది వెళ్తుండగా మార్గం మధ్యలో మోరి నాలుగురోడ్ల కూడలిలో టాటా మ్యాజిక్ వ్యాన్ ఢీ కొట్టడంతో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికుల సమాచారంతో 108 పై ఇరువురుని రాజోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా రామారావుకు తీవ్ర గాయాలు కావడంతో అత్యుత్తమ సేవలు కోసం అమలాపురం తరలించగా మార్గం మధ్యలో మృతి చెందారు. భార్య గిరిజ కాలు విరిగి గాయాలపాలైంది. రామారావు 1999 నుండి సిపిఎం నాయకులుగా, సిఐటియు సీనియర్ నాయకులుగా కొనసాగుతున్నారు. రామారావు డ్రైనేజీ డివిజన్, ఇరిగేషన్ ఉద్యోగుల సంఘం నాయకుడిగా, రాజోలు మండలం సిఐటియు కార్యదర్శిగా విఆర్ఏల సంఘం జిల్లా నాయకుడుగా, వివిధ ట్రేడ్ యునియన్‌ల సమస్యలపై, రైతులు, వ్యవసాయ కూలీలు, దళితులు, పేదల సమస్యలపై పలు పోరాటాల్లో పాల్గొన్నారు. ఆయన భార్య కందిగట్ల గిరిజ ఐద్వా జిల్లా నాయకులుగా కొనసాగుతున్నారు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు వివాహ సమయంలో ఇలాంటి సంఘటన జరగడంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

గిఫ్ట్ స్కీం బహుమతులు ప్రయాణికులకు అందజేత

విశాలాంధ్ర - గోకవరం : రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో కాకినాడ మరియు రాజమహేంద్రవరం, గోకవరం బస్టాండ్ రోడ్లలో తిరిగే బస్సులలో ప్రయాణించే ప్రయాణికుల కోసం ప్రవేశపెట్టిన గిఫ్ట్ స్కీం బహుమతులను గెలుచుకున్న ప్రయాణికులకు శుక్రవారం గోకవరం ఆర్టీసీ డిపో మేనేజర్ యు. రామన్న శుక్రవారం పంపిణీ చేశారు. గోకవరం ఆర్టీసీ డిపోకు చెందిన బస్సులలో ప్రయాణించిన ప్యాసింజర్లకు లక్కీ డిపిలో బహుమతి పొందిన కాకినాడకు చెందిన కే రాజేంద్రనాథ్‌కు, రాయవరం గ్రామానికి చెందిన ఎ. గంగరాజుకు డిపో మేనేజర్ విలువైన బహుమతులు అందజేశారు. ఈ లక్కీ డిపి స్కీం బహుమతులను గోకవరం ఆర్టీసీ డిపో ఎంప్లాయిస్ యూనియన్ సహకారంతో స్పాన్సర్ చేసినట్టు డిపో మేనేజర్ రామన్న తెలిపారు.

పోలీస్‌పెరేడ్ గ్రౌండ్‌లో వీఐపీ గ్యాలరీ ప్రారంభం

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ప్రతి సంవత్సరం స్వాతంత్ర్య దినోత్సవం రోజున, గణతంత్ర దినోత్సవం నాడు ఉత్సవాలు జరగడం అప్పటికప్పుడు నిధులు వెచ్చించి తాత్కాలికంగా విఐపి గ్యాలరిలు వంటివి నిర్మిస్తున్న విషయం అందరికీ తెలిసిందే. ఈ విధమైన ప్రక్రియ వలన సమయం, ఆర్థిక వనరులు ఖర్చు అవ్వడం, వర్షాకాల సమయంలో మరింత ఇబ్బంది పడడం అనే విషయాలపై దృష్టి సారించిన జిల్లా ఎస్‌పి యం రవీంద్రనాథ్ బాబు ఈ విషయాన్ని జిల్లా కలక్టర్‌కి తెలియ చెప్పి సహకారం కోరడంతో వారు వెంటనే స్పందించారు. ఓఎన్‌జిసి వారు ఇచ్చిన సిఎస్‌ఆర్ ఫండ్స్ నుండి 9.88 లక్షల రూపాయలను జిల్లా కలక్టర్ డాక్టర్ కృతికా శుక్లా పరేడ్ గ్రౌండ్‌లో విఐపి గ్యాలరీ నిర్మాణం కోసం మంజూరు చేశారు. ఈ నిర్మాణాన్ని జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ అదనపు ఎస్‌పి బి సత్యనారాయణ నేతృత్వంలో త్వరితగతిన పూర్తిచేయడం జరిగింది. ఈ విఐపి గ్యాలరీని కాకినాడ జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో జిల్లా కలక్టర్ డాక్టర్ కృతికా శుక్లా, కాకినాడ జిల్లా ఎస్పీ ఎం రవీంద్రనాథ్‌బాబుతో పాటుగా ఓఎన్జీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ & అసెట్ మేనేజర్ ఆదేశ్ కుమార్ శర్మ, ఓఎన్జిసి హెచ్‌ఆర్ విభాగపు అధిపతి డి. మాలిక్, అడిషనల్ ఎస్పీ అడ్మిన్ పి.శ్రీనివాస్, ఏఆర్ అడిషనల్ ఎస్పీ సత్యనారాయణ, కాకినాడ స్పెషల్ బ్రాంచి డీఎస్పీ యం అంబికా ప్రసాద్, పెద్దాపురం డిఎస్‌పి సుంకర మురళి మోహన్, కాకినాడ డిఎస్‌పి పడాల మురళీ కృష్ణ రెడ్డి ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం విజిలెన్స్ అధికారుల తనిఖీ

విశాలాంధ్ర - ఆత్రేయపురం : మండల కేంద్రంలో రీజనల్ విజిలెన్స్, ఎన్ఫోర్స్మెంట్ అధికారి పివి రవికుమార్ ఆదేశాల మేరకు ముత్యాల నాయుడు డిఎస్‌పి (విజిలెన్స్), కె విజయ కుమార్ తహశీల్దార్ (విజిలెన్స్) బృందం మండలంలో మహాత్మాగాంధీ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించారు. మెనూను రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. తదనంతరం పాఠశాల రికార్డులను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి పివి ప్రసాదరావు, ఉపాధ్యాయులు సీతామహా లక్ష్మీ, రవిరాజు, సిహెచ్ వెంకటేశ్వరరావు, జగదీష్ వర్మ, మహిళా పోలీసులు, వెల్ఫేర్ అసిస్టెంట్, ఏఎన్ఎమ్‌లు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర - సీతానగరం : ప్రతీ పేద కుటుంబానికి సొంత ఇళ్లే ప్రభుత్వ లక్ష్యం అని రాజానగరం నియోజకవర్గ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. మండలంలో ఉండేశ్వరపురం గ్రామంలో శుక్రవారం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ముఖ్య అతిథిగా ఇళ్ల స్థలాలు పంపిణీ, శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రాష్ట్రంలో ప్రతీ పేద వాడికి సొంత ఇళ్లు ఉండాలని లక్ష్యంతో పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో రమేష్, ఎంపీపీ జ్యోత్స్న, ఎంపీటీసీ దేవి, దాసరి డైరెక్టర్ డాక్టర్ బాబు, మండల కన్వనర్ ఘంటా శ్రీను, కో కన్వీనర్ హరి బాబు, సర్పంచ్ ఎం. ఈశ్వరరావు, కార్యదర్శి విఠల్, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు, అధికారులు పాల్గొన్నారు.

జగనన్న భూ హక్కు, భూ రక్ష పథకంలో శిక్షణ

విశాలాంధ్ర - ఆత్రేయపురం : మండల కేంద్రంలో మండల తహశీల్దార్ వారి కార్యాలయంలో జగనన్న భూ హక్కు భూ రక్ష పథకంలో భాగంగా స్వామిత్వ మండల స్థాయి శిక్షణా కార్యక్రమం అందరు పంచా యతీ కార్యదర్శులతోను, గ్రామ రెవెన్యూ అధికారుల తోను, సర్వేయర్లతోను, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లుతో మండల స్థాయిలో శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేశారు. సదరు పథకంలో భాగంగా గ్రామ స్థాయిలో జగనన్న భూ హక్కు భూ రక్షా పథకంపై విస్తృత ప్రచారం చేయవలసి ఉన్నదని, ఈ పథకంలో భాగంగా గ్రామంలో అన్ని ఇళ్లను, ఖాళీ స్థలాలను ఈ సర్వే ద్వారా గ్రౌండ్ ట్రూతింగ్, గ్రౌండ్ వ్యాలిడేషన్ ద్వారా చేయడం అన్ని ప్రభుత్వ భవనాలను, వీధులను, నివాస ప్రాంతాలను ఖాళీ భూములను ఈ పథకం ద్వారా గుర్తించనున్నట్టు మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి నాతి బుజ్జి తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి, ఎన్ బుజ్జి, తహశీల్దార్, పి అనిల్ కుమార్ శర్మ, పంచాయితీల విస్తరణాధికారి, డి. శ్రీనివాస్, మండల సర్వేయర్ ఎం. ప్రభావతి, మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, విఆర్‌ఓలు, సర్వేయర్లు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పేరవరంలో గడప-గడపకు మన ప్రభుత్వం

విశాలాంధ్ర - ఏలేశ్వరం : మండలంలోని పేరవరం గ్రామంలో ప్రత్తిపాడు శాసనసభ్యులు పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్ర మం నిర్వహించారు. తొలుత గ్రామంలోని బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాన్ని పూల మాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం ప్రతి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ అందిస్తున్న సంక్షేమ పథ కాలు వారి సరిగా అందు తున్నాయో లేదో తెలుసు కుని సమస్యలపై స్పందిస్తూ స్థానిక అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా పత్రికా విలేకరులతో మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. 2024 ఎన్నికల్లో 175 కి 175 అసెంబ్లీ స్థానాల్లో వైకాపా విజయం సాధిస్తుంద న్నారు. ఈ కార్యక్రమంలో మండల వైకాపా ఇన్‌చార్జి బదిరెడ్డి గోవిందబాబు, నీరుకొండ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పాస్ పోర్టు పోయినది

నా యొక్క పాస్‌పోర్టు పోయినది. **నెం : L2936556, తేది. 30.07.2013** జిరాక్సులు కొరకు తిరుగుడుమెట్ట గ్రామం నుండి తాళ్ళపూడి వెళుతుండగా పడిపోయినవి. దొరికిన వారు అందజేయగలరు.

అభిమన్యు సురేష్
తండ్రి ఎ. వెంకటేశ్వరరావు
తిరుగుడుమెట్ట, తూర్పుగోదావరి జిల్లా.
సెల్ : 9133570048

వెలుగు అధికారుల సస్పెన్షన్

విశాలాంధ్ర -వి. ఆర్. పురం : అల్లూరి సీతారామరాజు జిల్లా మండల కేంద్రం రేఖ పల్లి వెలుగు కార్యాలయంలో 2017 నుండి 2019 వరకు మహిళలకు వచ్చిన వి.వో.ఆర్.ఎఫ్, హెచ్.డి, సి.ఐ.ఎఫ్, టి.ఎన్.పి , అర్ యఫ్ తదితర నిధులలో కొంత సొమ్ము తమ సొంత ఖర్చులకు వెలుగు అధికారులు షణ్ముఖ రావు, అంజనేయులు వాడుకున్నారు. మీడియాలో ఆ విషయాలు బట్టబయలు అయ్యాయి. దీనితో సబ్ కలెక్టర్ పర్మద్ అహ్మద్‌ఖాన్, విచారణ చేయించగా రుజువైనందున ఇద్దరి అధికారులను సస్పెండ్ చేశారు.

పాతికేళ్ల కల ఫలించిన వేళ

విశాలాంధ్ర-రాజవొమ్మంగి : రాజవొమ్మంగి 99బిల్డింగుల రోడ్డు పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. ఈ రోడ్డు నిర్మాణం జరిగి పాతికేళ్లు కావడంతో రోడ్డు రూపురేఖలు పూర్తిగా మారిపోయి ప్రజలు నడవలేని పరిస్థితికిచేరుకుంది. మండల ప్రధాన కార్యాలయాలు నాలుగు స్కూల్స్‌కి, రెండు కాలేజీలకు, దేవాలయాలకు,చర్చ్ లకు ఇదే రహదారి కావడంతో నిత్యం ప్రజలతో రద్దీగా ఉండేది. ఈ రోడ్డు పై తిరిగేందుకు ప్రజలు చాలా ఇబ్బందులు పడేవారు. దీంతో స్థానిక ప్రజలు అప్పటి రాజకీయనాయకులకు, అధికారులకు రోడ్డు విషయమై ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఎంపిపి గోము వెంకటలక్ష్మి ఈ సమస్యను పలుమార్లు జిల్లాకలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన రోడ్డు నిర్మాణానికి పది లక్షలు మంజూరు చేయగా,ఎంపిపి మరో పది లక్షలు కలిపి రోడ్డు నిర్మాణం చేపట్టారు. దీంతో స్థానిక,మండలప్రజలు హర్షం వ్యక్తం చేశారు,ఈ రోడ్డు నిర్మాణానికి ఎంపిపితో పాటు స్థానిక వైసీపీ నేత దాట్ల వెంకటేశ్వరరాజు కృషి ఎంతో ఉన్నట్లు స్థానిక నాయకులు తెలిపారు.

వాల్మీకిలపై తప్పుడు ఆరోపణలు తగదు

విశాలాంధ్ర-రాజవొమ్మంగి : రంపచోడవరం డివిజన్‌లో వాల్మీకి తెగపై ఆదివాసీ సంక్షేమ,సాంస్కృతిక,ఉద్యోగ సంఘం వారు చేసిన తప్పుడు ఆరోపణలను మండల వాల్మీకి సంఘం ఖండించింది. శుక్రవారం జరిగిన సమావేశంలో మండలాధ్యక్షుడు వజ్రపు అప్పారావు మాట్లాడుతూ 1956 సంవత్సరం ముందునుండి వాల్మీకి తెగవారు అన్ని తెగలతో మమేకమై జీవనం సాగిస్తున్నారని,ఆనాటి మద్రాస్ ప్రభుత్వమే 1936 లో వాల్మీకి తెగను గుర్తించిందని,మాపై అనవసరనిందలు వేస్తే చట్టపరమైన చర్యలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు బండి చిట్టిబాబు, జుర్ర జాన్ బాబు, రాళ్లగడ్డ అర్జున్ పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వానిది అసమర్థత పాలన

విశాలాంధ్ర-ఎటపాక: వైసీపీ ప్రభుత్వానిది అసమర్థత పరిపాలన అని ఎటపాక మండల అధ్యక్షులు పుట్టి రమేష్ బాబు అన్నారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు,మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నా యుడు పిలుపు మేరకు, రంపచోడవరం ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి ఆదేశాల మేరకు అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం నెల్లిపాక గ్రామంలో నెల్లిపాక గ్రామ కమిటీ అధ్యక్షులు ఏలూరి వెంకన్న ఆధ్వర్యంలో రాష్ట్రానికి ఇదేం కర్మ అనే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు.ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ ఎటపాక మండల అధ్యక్షులు పుట్టి రమేష్ బాబు మాట్లాడుతూ అన్ని రంగాల్లో వెనుకబడి పోయిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని గాడిన పెట్టి సుపరిపాలన అందించడం చంద్రబాబు నాయుడుతోనే సాధ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి గొల్లపల్లి అప్పల స్వామి,నాలుగు మండల క్లస్టర్ ఇన్‌చార్జి మాచినేని రాజేష్,నెల్లిపాక గ్రామ పంచాయతీ సర్పంచ్ కొర్స భద్రమ్మ,తెలుగు యువత మండల అధ్యక్షులు నలజల మధు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గంగలకుర్రు అగ్రహారం విద్యార్థులు

విశాలాంధ్ర - అంబాజీపేట : డిసెంబర్ 1 రాజమహేంద్రవరంలో జరిగిన టేబుల్ టెన్నిస్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెలక్షన్స్‌లో జి అగ్రహారం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు అండర్ 17 విభాగంలో చిట్టుమేను సునీత, అండర్ 14 విభాగంలో మట్టపర్తి గ్రీష్మశ్రీ, కృష్ణాజిల్లాలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. బేస్ బాల్ అండర్ 14 విభాగంలో మట్టపర్తి మౌనిక కాకినాడలో జరగబోవు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. శుక్రవారం పాఠశాల హెచ్ఎం బీవీవీ సుబ్రమణ్యం అధ్యక్షతన జరిగిన సమావేశంలో గ్రామ సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, ఎంపీటీసీ విత్తనాల దుర్గా భవాని శేఖర్, రైతు భరోసా సలహా మండలి చైర్మన్ ఎంఎం శెట్టి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ మట్టపర్తి సూర్యనారాయణ విద్యార్థులకు ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ మట్టపర్తి దుర్గాప్రసాద్ లకు అభినందనలు తెలియజేశారు.

మాదిగ, ఉప కులాల చైతన్య మహాసభను విజయవంతం చేయాలి

విశాలాంధ్ర - అంబాజీపేట : డిసెంబర్11వ తేదీన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో జరిగే మాదిగ, మాదిగ ఉప కులాల చైతన్య మహాసభను విజయవంతం చేయాలని రాష్ట్ర మాదిగ పొలిటికల్ జేఏసీ చైర్మన్ బొమ్ము ఇజ్రాయల్ పిలుపునిచ్చారు. శుక్రవారం అంబాజీపేట మండలంలోని 16 గ్రామాల నుండి వచ్చిన మాదిగ నాయకులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు సమక్షంలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాదిగ నాయకులు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు కోనసీమ జిల్లాలో ఉన్న మూడు ఎమ్మెల్యే, ఒక ఎంపీ స్థానాల్లో రెండు ఎమ్మెల్యే స్థానాలు సామాజిక ప్రతిపాదికన మాదిగ,మాదిగ ఉపకులాలకు కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఈ సభ నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాదిగల పొలిటికల్ జెఎసి చైర్మన్ బొమ్మి ఇజ్రాయెల్‌తో పాటు క్రాపా నాగభూషణం, పెదపూడి శ్రీను, ఉందుర్తి నాగబాబు, తోత్తరమూడి హృదయకృష్ణ, ఈతకోట సత్యనారాయణ, ఉందుర్తి ఆనంద్ బాబు, మందా రాజేష్, నేదూనూరి ప్రసాద్, మందా నారాయుడు, కముజు స్వామి, ముమ్మిడివరపు సోమేష్, లూటికుర్తి రమణ, జొన్నాడ కిషోర్, మందా గంగాధర్, కూనవరపు రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గాడలో ప్రారంభమైన ఇదేమి ఖర్మ

విశాలాంధ్ర - గొల్లప్రోలు : గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామంలో శుక్రవారం మన రాష్ట్రానికి ఇదేమి ఖర్మ అనే కార్యక్రమాన్ని జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు ఆదేశాలు మేరకు పిఠాపురం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర అధికార ప్రతినిధి వర్మ అధ్యక్షతన తేదేపా శ్రేణులు ఇదేమి ఖర్మ నిర్వహించారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ అధినేత మాటల్లోనే కాదని, ప్రజలు మనస్సులో కూడా ఇదే ఆలోచన ఉందన్నారు. వచ్చే ఎన్నికలు కోసం జనం ఎదురు చూస్తున్నారని చంద్రబాబు వస్తారన్న ఆశతో,సుపరిపాలన కోసం అందరూ కోరుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు తూము బాబు, పెనుగొండ లక్ష్మీపతి, కొమ్మూరు కృష్ణ, గొల్లపల్లి భాస్కర్, నామాల వీరబ్బాయి, దుర్గాడ సాయి, జిల్లా నాయకులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ అధికారులు పనిచేయాలని పోలవరం శాసనసభ్యులు తెల్లం బాలరాజు అన్నారు. మండలంలో గవరవరం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గ్రామ కమిటీ అధ్యక్షుడు శిమకుర్తి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న శాసనసభ్యులు బాలరాజు గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. శాసనసభ్యులు దృష్టికి గ్రామంలోని డ్రైనేజీ సమస్య ఎక్కువగా ఉన్నదని , కొన్నిచోట్ల వ్యర్థ పదార్థాలతో చెత్త ఉండటం వలన లైట్లు లేక పాములు సంచరిస్తున్నాయని ఈ సమస్యను పరిష్కరించాలని పలువురు మహిళలు ఆయనకు తెలిపారు. వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి ప్రజా సమస్యలను పరిష్కరించాలని బాలరాజు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గంజిమల రామారావు, జడ్పిటిసి దాసరి శ్రీలక్ష్మి, తగరం ఆశీర్వాదం, కొయ్యలగూడెం పట్టణ అధ్యక్షుడు సంకు కొండలరావు, ఎంపీడీవో కృష్ణ ప్రసాద్, ఎంఈఓ సురేష్ బాబు, ఆర్ ఐ మణి దివ్య, ఏపీఎం సుబ్రహ్మణ్యం, అర్డబ్ల్యు ఎస్ ఏ ఈ ఉదయ్ కుమార్, ఏపీవో నాగేశ్వరరావు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, వైయస్సార్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీకి పూర్వవైభవం

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : టీడీపీకి పూర్వ వైభవం తీసుకొచ్చి ముఖ్యమంత్రిగా చంద్రబాబును ఎన్నుకోవ దమే తన లక్ష్యం అని టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ సభ్యురాలు గంగిరెడ్ల మేఘలాదేవి పేర్కొన్నారు. శుక్రవారం ఆమె నివాసం వద్ద చంద్రబాబు చేపట్టిన బాదుడే బాదుడు, ఇదేం కర్మ మన రాష్ట్రానికి, కార్యక్రమాలకు వస్తున్న ప్రజా ధారణ, ఓటర్ల పేరు నమోదు, పార్టీ సభ్యత్వ నమోదు, తదితర అంశాలపై పార్టీ నాయకులతో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చంద్రబాబు పర్యటనకు విశేష స్పందన లభిస్తుందని, మహిళల పక్షపాతి చంద్రబాబు అన్నారు అనంతరం26 మంది మహిళలకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మహిళ నాయకులు చెరుకూరి రమ్య, రాజేశ్వరి ,మహాలక్ష్మి ,వెంకటేశ్వరమ్మ, లక్ష్మి, ముత్యాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

బాల దుర్గమ్మ ఆలయంలో తులాభారం

విశాలాంధ్ర - దేవరపల్లి : దేవరపల్లి లోని బాల దుర్గమ్మ ఆలయంలో తులాభార కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మండలంలోని రామన్నపాలెం గ్రామానికి చెందిన ఉండవల్లి సత్యనారాయణ, దివ్య దంపతుల కుమారుడు హన్సిత్ కు బాలదుర్గమ్మ ఆలయంలో శుక్రవారం పటిక బెల్లంతో తులాభారం వేశారు. అంతకుముందు బాలదుర్గమ్మ అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పైడికొండల సత్యనారాయణ, కామిశెట్టి దుర్గారావు, కామిశెట్టిమంగ, పైడికొండల వెంకటేశ్వరరావు, స్థానిక మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం

విశాలాంధ్ర -ఉంగుటూరు : ఉంగుటూరు మండలం కైకరం గ్రామానికి చెందిన కోనే సత్యనారాయణ దివ్యాంగుడు. ఆయన దివ్యాంగుల కోసం ఫిజికల్లీ ఛాలెంజ్ పర్సన్స్ అసోసియేషన్ కైకరం 2008 డిసెంబర్ 28వ తేదీన ఈ సంస్థను దివ్యాంగ సంక్షేమం కోసం ఏర్పాటు చేశారు. అప్పటినుంచి ఇప్పటివరకు నిరంతరంగా దివ్యాంగులకు దివ్యాంగ్ మహాసంఘటన సంస్థల ఆర్థిక సౌజన్యంతో కావలసిన సర్టిఫికెట్స్ ,ఉపకరణాలు, స్కాలర్షిప్స్,కృత్రిమ కాలు, చేతులు ఎంతోమందికి ఈ సంస్థ ద్వారా ఏర్పాటు చేయడం జరిగింది. ఇవి సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు కోనే వీర వెంకట సత్యనారాయణ ఆయన చేసిన కార్యక్రమాలకు గుర్తింపుగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విభిన్న ప్రతిభావంతుల రాష్ట్ర అవార్డు ఇచ్చింది. సత్యనారాయణ దివ్య మహా సంఘటన రాష్ట్ర అధికార ప్రతినిధిగా, నేషనల్ ట్రస్ట్ లోకల్ లెవెల్ కమిటీ మెంబర్ గా ఉంగుటూరు మండలం మానవత కార్యవర్గ సభ్యులుగా కొనసాగుచున్నారు. దివ్యాంగులు అని నిరుత్సాహంతో ఉండరాదని మనమంతా ఐక్యమత్యంగా ఉండి సేవ చేయటమే అసలైన సంతృప్తిని సత్యనారాయణ అన్నారు. శనివారం భీమవరంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు.

టీడీపీ కార్యకర్తలకు కృతజ్ఞతలు

విశాలాంధ్ర - కొయ్యలగూడెం: టీడీపీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన కొయ్యలగూడెం మండలంలో విజయవంతం చేసినందుకు మండల పార్టీ ఉపాధ్యక్షుడు నిమ్మగడ్డ రవీంద్రనాథ్ పార్టీ నాయకులకు ,కార్యకర్తలకు, క్లస్టర్ కన్వీనర్లకు, యూనిట్ కన్వీనర్లకు, బూత్ కన్వీనర్లకు, మండల కమిటీ సభ్యులకు అనుబంధ సంస్థలకు, మండలంలో ఉన్న అన్ని గ్రామాల పార్టీ నాయకులకు కార్యకర్తలకు, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపినట్లు శుక్రవారం ఒక ప్రకటన లో తెలిపారు.

గృహనిర్మాణ లబ్దిదారుల సమస్యల పరిష్కారానికి కృషి

విశాలాంధ్ర-టి.నరసాపురం : జగనన్న గృహ నిర్మాణం లబ్ది దారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జడ్పీటీసీ సభ్యులు సామంత పూడి బాల సూర్యనారాయణ రాజు అన్నారు. మండలం లోని బొర్రంపాలెం, వీరభద్రవరం గ్రామాలలో లబ్దిదారులకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ జగనన్న గృహ నిర్మాణం లబ్ధి దారులు సమస్యలు పరిష్కరించాలని తెలిపారు. లబ్ధి దారులు గృహం నిర్మించుకోలేక పోతే కాంట్రాక్టు ప్రాతిపదికన ఇళ్ళు నిర్మించి ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. త్వరితగతిన ఇళ్ళ నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు . ఈ కార్యక్రమంలో అప్పలరాజు గూడెం సర్పంచ్ జల్లా మూర్తి, ఎంపిటిసి మామిళ్ళ సత్తిబాబు, నాయకులు ఉమ్మడి తేజ, హౌసింగ్ ఎఇ రాధాకృష్ణ ,ఏఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు ఆహార పదార్థాలు అందజేత

విశాలాంధ్ర - కలిదిండి: పంచాయతీపారిశుద్ధ్య కార్మికులు డ్రైనేజీలలో మట్టిపూడిక పనులు చేస్తున్నవారికి ఎంపిటిసి నీలి సుమన్ ఆర్థిక సహాయంతో ఆహార పదార్థాలు (భోజనాలు) తన ఎరువుల దుకాణం వద్ద శుక్రవారం కార్మికులకు అందజేశారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులు మురుగు డ్రైనేజీ దిగి శుభ్రం చేస్తున్నందున కార్మికులకు ఆహార పదార్థాలను అందజేయటం తనకు ఎంతో సంతృప్తికరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మందుల షాపుబికీ, చుక్కాలు, పంచాయతీ సిబ్బంది వెంకటాచలం, 11 మంది కార్మికులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై రైతులు అవగాహన పెంచుకోవాలి

విశాలాంధ్ర - కిర్లంపూడి : ఆర్థిక అక్షరాస్యత పై అవగాహన పెంచుకోవాలని ప్రత్తిపాడు డిసిసిబి బ్యాంకు మేనేజర్ జి. రజని అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన కిర్లంపూడిలో ఉన్న ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం కార్యాలయంలో కాకినాడ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు, నాబార్డు సౌజన్యంతో రైతులకు ఆర్థిక అక్షరాస్యత పైనా, సహకార బ్యాంకులో పలు లావాదేవీలుపైనా ఖాతాదారులకు, రైతులకు కలిగే ప్రయోజనాలపైనా అవగాహనా సమావేశం నిర్వహించారు. కిర్లంపూడి సొసైటీ అధ్యక్షుడు చదలవాడ బాబి అధ్యక్షతన జరిగిన సమావేశానికి రజని ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రజని మాట్లాడుతూ ప్రతి ఒక్కరు విధిగా బ్యాంకు ఖాతా కలిగి ఉండడమే కాకుండా, బ్యాంకులో నగదును సేవింగ్ ఖాతాల్లో దాచుకోవడం వల్ల అవసరానికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. పిఎసిఎస్, సిఇఒ కట్టా రాజబాబు, కిర్లంపూడి మేనేజర్ పి కుక్కుటేశ్వరరావు, డిసిసిబి, ప్రత్తిపాడు, పిఎసిఎస్ కిర్లంపూడి సూపర్వైజర్ కొండబాబు బ్యాంకు అందిస్తున్న సేవలపై రైతులకు విపులంగా వివరించారు. ఈ కార్యక్రమంలో గౌతు మూర్తి సత్తిబాబు, ఎంపిటిసిలు కాళ్ళ దొంగబాబు రాపేటి ప్రసాద్, రైతులు కంపరపు నాగేశ్వరరావు, ఆళ్ళ బాబులు, యల్లపు శివ, సూరిబాబు, పలువురు రైతులు పాల్గొన్నారు.

సిఐటియు రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

విశాలాంధ్ర -భీమవరం: జనవరి 2, 3, 4వ తేదీల్లో భీమవరంలో జరిగే సిఐటియు 16వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆహ్వాన సంఘం గౌరవాధ్యక్షులు, ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.ఉమా మహేశ్వరరావు కార్మిక లోకానికి పిలుపునిచ్చారు. శుక్రవారం సిఐటియు కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న పాలకులకు వ్యతిరేకంగా అరుణ పోరాటాలు చేయాల్సిన సమయం ఆసన్నమైందని ఈ నేపధ్యంలో భీమవరంలో జరుగుతున్న రాష్ట్ర మహాసభలు ఎంతో ప్రాముఖ్యత సంతరించుకున్నాయన్నారు. కేంద్రంలో లాభాల్లో ఉన్న ప్రభుత్వ రంగ పరిశ్రమల ప్రయివేటీకరణ ఒక వైపు, కార్మిక చట్టాల కుదింపు, నల్ల కార్మిక చట్టాలను, రిటైల్ రంగంలోకి విదేశీ పెట్టుబడులు కార్మిక ప్రయోజనాలను తుంగలో తొక్కుతుంటే రాష్ట్రంలో ఆశా, అంగన్వాడీ, మున్సిపల్, హెల్తు, విద్యుత్, ఆర్టీసీ, బిల్డింగ్ సెస్ 1200 కోట్లు ప్రభుత్వం లాగేసుకోవడంతో భవన నిర్మాణ కార్మికులకు క్లెయిమ్స్ ఆగిపోయాయని ఇలా అన్ని అంశాల్లో కార్మికులు వీధినపడ్తున్నారని వారు మండిపడ్డారు. మహాసభల ప్రారంభం సందర్భంగా జనవరి 2న పుర వీధుల్లో వేలాది మందితో మహా ప్రదర్శన, లూథరన్ గ్రౌండ్సులో భారీ బహిరంగ సభ జరుగుతుందని, 3, 4వ తేదీల్లో ప్రతినిధుల సమావేశాలు, తీర్మానాల ఆమోదం, కొత్త కార్యవర్గం ఎన్నిక జరుగుతుందని వారు తెలిపారు. మీడియా సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షుడు జెఎన్వీ గోపాలన్, ప్రధాన కార్యదర్శి కె.రాజారామమోహన్ రాయ్, ఉపాధ్యక్షుడు బి.వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళల 'సేఫ్' అవగాహన కార్యక్రమం

విశాలాంధ్ర-కొయ్యలగూడెం: మహిళలపై హింస మానవ మనుగడకు మంచి కాదని సచివాలయాల శాఖ సామాజిక ప్రవర్తన మార్పు సమాచార విభాగం జిల్లా కోఆర్డినేటర్ టి.యన్.స్నేహన్ అభిభాషించారు. హింసను ఎదుర్కోవటానికి విస్తృత అవగాహన కోసం "సేఫ్" కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. శుక్రవారం స్పెషల్ ఏవేర్నెష్ టు ఫీమేల్స్ ఇన్ ఏలూరు (ఎస్.ఏ.ఎఫ్.ఏ) కార్యక్రమాన్ని కొయ్యలగూడెంలో నిర్వహించారు. ప్రపంచ స్త్రీ హింస వ్యతిరేక ప్రచారోద్యమంలో భాగంగా స్త్రీ శక్తి భవనంలో మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్నేహన్ ముఖ్య ఉపన్యాసం చేశారు. ఆడపిల్లలను, మగ పిల్లలను సమానంగా చూడకుండా ఇంటి దగ్గర నుండే హింస ప్రారంభమవుతుందన్నారు. ఆహారం విషయంలో కూడా వ్యత్యాసం చూపే తల్లులు ఉండటం వల్ల అడపిల్లల్లో రక్త హీనత కనిపిస్తుంద న్నారు. ఆడపిల్లల అశలు నెరవేరకుండా చిన్నప్పుడే పెళ్లిళ్ళు చేయటం కూడా హింసేనన్నారు. అందువల్ల మహిళలు హింసను రూపుమాపటానికి ముందుకు రావాలన్నారు. తమపై జరిగే గృహ హింస,లైంగిక హింసను ధైర్యంగా ఎదుర్కోవలన్నారు.మహిళలపై హింస రూపుమాపటానికి జరుగుతున్న ప్రచారోద్యమం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. తొలుత పరిపూడి గ్రామ సచివాలయం2 సందర్శించి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. పరింపూడి రామాలయం, తారకరామ నగర్ అంగన్ వాడీ కేంద్రాలు పరిశీలించారు. ఈ కార్యక్రమానికి ఏ.పి.ఎం సుబ్రహ్మణ్యం, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు చిన్నాయమ్మ, ఐకేపీ సి సి లు కృష్ణ, శ్రీనివాసరావు,మహిళా సభ్యులు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్య అభ్యసించాలి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : విలువలతో కూడిన విద్యను చిన్ననాటి నుండే విద్యార్థులు విద్యను అభ్యసించాలని ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే దిశగా విద్యను బోధించాలని గంగన్నగూడెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల తల్లితండ్రుల కమిటీ చైర్మన్ కొయ్యల పుష్పలత పేర్కొన్నారు. పాఠశాలలోని విద్యార్థిని విద్యార్థులకు పుష్పలత చేతుల మీదుగా ఐడెంటిటీ కార్డులను అందజేశారు. విద్యార్థులు ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను శ్రద్ధగా విని ఉన్నత శిఖరాలను అధిరోహించా లని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.వి .రావు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సుబ్బయ్యమ్మపేటలో ఇదేమి ఖర్మ రాష్ట్రానికి

విశాలాంధ్ర - గండేపల్లి : ఇదేమి ఖర్మ రాష్ట్రానికి, కార్యక్రమాన్ని గండేపల్లి మండలం సుబ్బయ్యమ్మపేటలో ప్రారంభించారు. ఈ సందర్భంగా జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ రాష్ట్రంలో అవగాహన రాహిత్యంతో పరిపాలన కొనసాగుతుందని, రాష్ట్రం అన్ని రంగాలలోని సర్వనాశనం అయిపోయిందన్నారు. హద్దు అదుపు లేని అప్పులు చేసి రాష్ట్రాన్ని అప్పుల ఆంధ్రప్రదేశ్ గా మార్చారన్నారు. రాబోయే రోజుల్లో తెలుగుదేశం ప్రభుత్వాన్ని గెలిపించుకుని చంద్రబాబు నాయుడుని ముఖ్యమంత్రిని చేసుకోబోతే మన బిడ్డల భవిష్యత్తు సర్వనాశనం అయిపోతుందన్నారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర టిడిపి కార్యదర్శి ఎస్వీఎస్ అప్పలరాజు, గండేపల్లి మండల టిడిపి అధ్యక్షులు పోతుల మోహన్‌రావు, మండల తెలుగు రైతు అధ్యక్షులు అడబాల భాస్కరరావు, సుబ్బయ్యమ్మ పేట మాజీ సర్పంచ్ బోండా శ్రీనుబాబు, గొల్లవిల్లి రాజు, గ్రామ టిడిపి అధ్యక్షులు బొండా శ్రీను తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

వైకాపా ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాల ప్రజలకు ఇబ్బందులు

విశాలాంధ్ర - పి గన్నవరం : వైకాపా ప్రభుత్వ హయంలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిలు నామన రాంబాబు, డొక్కా నాద్ బాబు ఆరోపించారు. ఈ మేరకు పి గన్నవరం మండ లంలోని కే ఏనుగుపల్లి గ్రామంలో తెలుగుదేశం పార్టీ శ్రేణులు నిర్వహించిన ఇదేం కర్మ రాష్ట్రానికి కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడుతూ కష్టపడి పండించిన పంటను రైతులు గిట్టుబాటు ధరకు అమ్ముకునే పరిస్థితి వైకాపా ప్రభుత్వం కల్పించలేకపోయింది అన్నారు. అధ్వానంగా మారిన రహదారులను ప్రభుత్వం సకాలంలో అభివృద్ధి చేయకపోవడం వలన ప్రజలందరూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు ఇంటింటికి తిరుగుతూ వైకాపా ప్రభుత్వ వైఫల్యాలపై ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు దాసరి వీర వెంకట సత్యనారాయణ, తోలేటి సత్తిబాబు, మొల్లేటి శ్రీనివాస్, నేదునూరి వీర్రాజు, పులపర్తి రవికుమార్, మట్టపర్తి రామకృష్ణ, మట్టపర్తి రాజేశ్వరరావు, మోతా వెంకటేశ్వరరావు, పబ్బినీడి రాంబాబు, పల్లి రామ్మూర్తి, మందపాటి కిరణ్ కుమార్, బాణం సత్య నాగేశ్వరరావు, గోగి రమేష్, నక్కా సునీల్ రాజు, బొండాడ నాగమణి, శేరు శ్రీను, నేలపూడి దామోదర్, పైడి బుజ్జి, సుదా బాబ్జి, విత్తనాల ఆదినారాయణ, బొరుసు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'ఇదేం కర్మ మన రాష్ట్రానికి' ప్రారంభించిన వరుపుల రాజా

విశాలాంధ్ర - రౌతులపూడి : తెలుగుదేశం పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని ప్రత్తిపాడు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ నాయకులు వరుపుల మండలంలోని గుమ్మరేగుల గ్రామంలో ప్రారంభించారు. ప్రత్తిపాడు నియోజకవర్గ అభివృద్ధికి మీ ఆలోచనలు సలహాలు సూచనలతో భావితరాల భవిష్యత్తు కొరకు మీ ఇంటికి మీ కుటుంబ సభ్యునిగావస్తున్నానని, వరుపుల రాజా అన్నారు. నియోజకవర్గంలో ప్రతి గ్రామ క్లస్టర్ ఇంచార్జిలు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని రాజా సూచించారు. మీ గ్రామాలలో ప్రతి ఇంటికి మీకు అందజేయబడిన "ఏం ఖర్మరా రాష్ట్రానికి" చేరవేయాలన్నారు. మాజీ జిల్లా పరిషత్ అధ్యక్షులు చేతుల నవీన్ కుమార్ మాట్లాడుతూ ఈనాడు రాష్ట్రంలో వైఎస్సార్ పార్టీ పాలనలో రాష్ట్రం పూర్తిగా వెనుకబడిందన్నారు. ఫ్యాక్టరీలు రావట్లేదని దీంతో నిరుద్యోగ సమస్య పెరిగిందని, రోడ్ల నిర్మాణం జరగలేదని ఆయన విమర్శించారు. రౌతులపూడి మాజీ మండల అధ్యక్షులు యి టంశెట్టి సూర్య భాస్కర బాబు, గంటా గోపి బలరామపురం ఎంపీటీసీ సోమరవుతు రవి, పల్లపు చామవరం మాజీ సర్పంచ్ సింహాద్రి పెదబాబు, గుమ్మరేగుల తెలుగుదేశం పార్టీ నాయకులు రమణ, దిగువసేవాడ మాజీ సర్పంచ్ పెంచాడ బుజ్జి, ఎస్ఎస్ పట్నం మాజీ సర్పంచ్ లాలం అప్పలనాయుడు, ప్రజలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఊనగట్లలో గడప గడపకు ప్రభుత్వం

విశాలాంధ్ర-చాగల్లు : రాష్ట్రం లో అర్హులైన పింఛను లబ్ధిదారు లకు ప్రతినెలా ఒకటోవ తేదిన వాలంటీర్ల ద్వారా ఇంటి ముంగిటకే పింఛన్లు పంపిణీ చేస్తున్నామని, జగనన్న గోరుముద్ద పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనాలు పెడుతున్నామని రాష్ట్ర హెూం మంత్రి డాక్టర్ తానేటి వనిత పేర్కొన్నారు. చాగల్లు మండలం ఊనగట్ల గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో శుక్రవారం మంత్రి వనిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా వనిత మాట్లాడుతూ జగనన్న గోరుముద్ద పథకం ద్వారా విద్యార్థులకు నాణ్యమైన భోజనాలు పెడుతున్నామని అన్నారు. ఊనగట్ల మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనాలు పెడుతున్న తీరును పరిశీలించారు. విద్యార్థులకు మంచి పుష్టికరమైన ఆహారం అందించాలని ఉపాధ్యాయులను మంత్రి ఆదేశించారు. రాష్ట్రం లో మహిళల సంక్షే మానికి పెద్ద పీట వేస్తూ, జగ నన్న ప్రభుత్వం నామినేటెడ్ పదవుల్లో 50 శాతం రిజర్వేషన్ కల్పించిందని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ ఛైర్పర్సన్ పోసిన శ్రీలేఖ, ఏఎంసీ ఛైర్మెన్ వల్లభ శెట్టి గంగాధర శ్రీనివాసరావు, ఎంపీపీ మట్టా వీరాస్వామి, ఆతుకూరి దొరయ్య, తహసీల్దారు ఎం. శ్రీనివాసరావు, ఎంపీడీవో బి.రాంప్రసాద్, గ్రామ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయ సిబ్బంది తదిత రులు పాల్గొన్నారు.

3,4 తేదీల్లో ఓటు నమోదు కార్యక్రమం

విశాలాంధ్ర - జంగారెడ్డిగూడెం : 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు తప్పనిసరిగా తమ ఓటును నమోదు చేయించుకోవాలని జంగారెడ్డిగూడెం తహసీల్దార్ కేసు లేవ జ్యోతి తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. డిసెంబర్ 3 4 తేదీల్లో శని ఆదివారాలు చింతలపూడి నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాలలో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించబడుతుందని ఆయన పేర్కొన్నారు.18 సంవత్సరాలు వయసు నిండిన యువతీ యువకులకు, 17 సంవత్సరాలు కలిగిన యువతీ యువకులకు కూడా ఓటు నమోదు చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించినందున అక్టోబర్ 1 2005 సంవత్సరం నుండి 2022 లోపు పుట్టిన వారు ముందస్తుగా తమ ఓటు నమోదు చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందని తెలిపారు.కొత్త ఓటర్ నమోదు కోసం ఫారం 6, ఓటు కార్డు తొలగింపు కొరకు ఫారం 7, నివాసం మార్పు కొరకు ఫారం, వాటర్ కార్డు ఎంట్రీలలో మార్పులు కొరకు, ఓటర్ కార్డు భర్తీ కొరకు ఫారం 8 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు .ఈ రెండు రోజులపాటు అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద బూత్ లెవెల్ అధికారులు అందుబాటులో ఉంటారని,ఈ అవకాశం అందరూ వినియోగించుకోవాలని సూచించారు.

తప్పని సరిగా ఓటుహక్కు నమోదు చేసుకోవాలి

విశాలాంధ్ర-గోపాలపురం : 18 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు నమోదు చేయాలని తహసిల్దార్ బి. రవీంద్రనాథ్ బిఎల్ఓ లకు సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో బూత్ లెవెల్ అధికారులకు ఎన్నికల ప్రక్రియపై అవగాహన సదస్సు నిర్వహించారు.రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి, జిల్లా ఎన్నికల అధికారి,తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ ఆదేశాలు మేరకు గోపాలపురం మండలం లో గల అన్ని బూత్ లెవెల్ ఆఫీసర్ లకు, సూపర్‌వైజర్ ఆఫీసర్లకు, పంచాయతీ సెక్రటరీ లకు, సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ బి. రవీంద్రనాథ్ మాట్లాడుతూ స్పెషల్ సమ్మరీ రివిజన్-2023, ప్రీ రివిజన్ ఆక్టివిటీస్ లో భాగంగా ఓటరు కార్డునకు ఆధార్ను అనుసంధానంచేయు ప్రక్రియ ,ఇంటింటి సర్వే , నవంబర్ 19,20 తేదిలో జరిగిన స్పెషల్ కాంపైన్ లో వచ్చిన క్రొత్త ఓటర్ నమోదు ,చనిపోయినవారి యొక్క ఓటు లు తొలగించుట ఈనెల మూడు నాలుగు తేదీల్లో జరిగే.స్పెషల్ క్యాంపైన్ డే గురించి బి ఎల్ ఓ లు పోలింగ్ బూత్ లోని ప్రజలకు తెలియచేసి, ఓటు హక్కు నమోదుఅవకాశం సద్వినియోగం చేసుకునే విధంగా చూడాలని, మరి ముఖ్యం గా ప్రతి ఒక్క బూత్ లెవెల్ ఆఫీసర్ కూడా తమ పోలింగ్ స్టేషన్ పైఅవగాహన కలిగిఉండాలని, 17 సంవత్సల పైబడిన వారిని గుర్తించి క్రొత్త ఓటుగా నమోదు చేయించాలని, వివరించారు . ఈ కార్యక్రమం లో మండలం లోని పంచాయతీ సెక్రటరీ లు,సూపర్ వైజర్ లు , ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ కే. యు. శ్రీనివాస్ , గ్రామ కార్యదర్శులు, బి యల్ ఓ లు పాల్గొన్నారు.

చంద్రబాబు సభకు తరలి వెళ్లిన తెలుగు తమ్ముళ్లు

విశాలాంధ్ర -భీమవరం: ఇదేమికర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని ప్రారంభించి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో పర్యటిస్తున్న నారా చంద్రబాబు నాయుడు తాడేపల్లిగూడెం సభకు భీమవరం నియోజకవర్గ టిడిపి నాయకులు శుక్రవారం తరలి వెళ్లారు. ముందుగా భీమవరం టిడిపి కార్యాలయం వద్ద భారీ కార్ల మోటార్ సైకిల్ ర్యాలీని పార్టీ రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారధి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మెంటే మాట్లాడుతూ చంద్రబాబు పర్యటనకు విశేష స్పందన వస్తుందన్న అక్కస్సుతో పోలవరం అడ్డుకోవడం పిరికిపంద చర్యని విమర్శించారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు మామిడి శెట్టి ప్రసాద్, మాజీ కౌన్సిలర్లు మెంటే గోపి, మైలాబత్తుల ఐజాక్ బాబు, పంతం వెంకటసతీష్, గంటా త్రిమూర్తులు, మద్దుల రాము, వీరవాసరం భీమవరం రూరల్ నాయకులు అత్యధిక సంఖ్యలో తరలి వెళ్లారు.

'వికాస' కార్యాలయంలో 5న జాబ్‌మేళా

విశాలాంధ్ర - కాకినాడ : "వికాస" కార్యాలయంలో ఈనెల 5వ తేదీ సోమవారం "జాబ్‌మేళా" నిర్వహిస్తున్నారు. ఈ జాబ్‌మేళాలో 11 కంపెనీల్లో సుమారు 411 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. బ్లూరే హాస్పటల్స్‌లో మార్కెటింగ్ మేనేజర్, పిఆర్ఒ, జిఎన్ఎం నర్సింగ్ స్టాఫ్, హెల్పర్ అవర్‌నీడ్స్, కామ్‌లో బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్, ఫొటోన్ డెకర్స్‌లో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, కో జెంట్ ఇ సర్వీసెస్‌లో బిసిఒ, రాక్‌మెన్ ఇండస్ట్రీస్ లిమిటెడ్‌లో క్వాలిటీ, మెయిన్‌టైన్స్ డిపార్ట్‌మెంట్ వీల్‌మార్ట్ ఆటో ఫైనాన్స్‌లో సేల్స్ ఎగ్జిక్యూటివ్, అకౌంటెంట్ తదితర ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. మరిన్ని వివరాలకు 8297400666, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.వికాసజాబ్స్.కాం సంప్రదించండి.

ఓటరు జాబితా సవరణ

విశాలాంధ్ర -భీమవరం టౌన్ : భీమవరం నియోజకవర్గ పరిధిలో 2023 సంవత్సరముకు గాను ఓటర్ల సమగ్ర సవరణ కార్యక్రమం ఈనెల 8,9 శని, ఆదివారాలలో ఆయా పోలింగ్ బూత్‌లలో బూత్ లెవెల్ అధికారులు అందుబాటులో ఉంటారని 18 సంవత్సరములు నిండిన ప్రతి పౌరుడు వాటర్ గా నమోదు చేయించుకోవచ్చన్నారు. మార్పులు చేర్పులు చేయించుకోవచ్చని భీమవరం తహసీల్దార్ వై.విజయ్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు

కార్తీకమాసం వెళ్లినా ఆగని అన్నదాన కార్యక్రమం

విశాలాంధ్ర - కిర్లంపూడి : మండల కేంద్రమైన కిర్లంపూడి నుండి రాజుపాలెం వెళ్లే దారిలో వేంచేసియున్న శ్రీ వనదుర్గాదేవి అమ్మవారి ఆలయం వద్ద అనిల్ పార్కింగ్ టైల్స్ అధినేత, ఆలయ అభివృద్ధి ప్రదాత సేనాపతి కన్నబాబు, సరిసే వాసు, గునూరి సందీప్, ఆధ్వర్యంలో శుక్రవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అమ్మవారి ఆలయం వద్ద ఈ సంవత్సరం దేవీ నవరాత్రులను పురస్కరించుకుని ఆలయం వద్ద తొమ్మిది రోజులు పాటు నిరంతరంగా భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్తీక మాసంలో కూడా ప్రతి శుక్రవారం, ప్రతి సోమవారం భారీ కార్యక్రమాన్ని నిర్వహించి కార్తీక మాసాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారి ఆలయం వద్ద సంవత్సరం పొడవునా ప్రతి శుక్రవారం అన్నదానం నిర్వహించాలని వారు నిర్ణయం తీసుకోవడంతో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి సేనాపతి కన్నబాబు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పేరుగాంచిన నవదుర్గ అమ్మవారి ఆలయం వద్ద ప్రతి శుక్రవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం తమ అదృష్టంగా భావిస్తున్నామన్నారు. అమ్మవారి ఆలయం వద్ద ప్రతి శుక్రవారం నిర్వహించే అన్నదాన కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకోవడమే కాకుండా అన్న ప్రసాదములు స్వీకరించాలని ఈ సందర్భంగా కోరారు. అలాగే అన్నదాన కార్యక్రమానికి తమవంతు సహాయ సహకారాలు అందించి అమ్మవారి కృపా కటాక్షములు పొందాలని ఈ సందర్భంగా కన్నబాబు కోరారు. అమ్మవారి ఆలయం వద్ద సేనాపతి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జగపతినగరం మహిళా భజన మండలి సభ్యులు భక్తి గీతాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ అన్నదాన కార్యక్రమంలో సింగలూరి నాని, సేనాపతి రాంబాబు, గండ్రెడ్డి ఆనంద్, కర్రి వెంకటలక్ష్మి, వంగా దుర్గ పలువురు పాల్గొని అన్నదాన కార్యక్రమానికి వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకున్నారు.